నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

EVENING EDITION

www.suryaa.com పేజీలు: 02

హైందవ జాతి రక్షణే ధ్యేయంగా విధర్మీయుల
గుండెల్లో నిద్రించిన ధీరుడు..
ధర్మ రక్షణే ధ్యానంగా తపించిన ధర్మవీరుడు..
హిందుత్వమే ప్రాణంగా, స్వాభిమానమే ఆయుధంగా
జాతి పౌరుషాన్ని చాటిన శత్రు భయంకరుడు,
హిందూ హృదయ సామ్రాట్

ఛత్రపతి శివాజీ మహారాజ్
జయంతి శుభాకాంక్షలు

WWW.SURYAA.COM

ఢిల్లీకి సీఎం రేవంత్

పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ టూర్‌లో ఆయన కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో భేటీ అవనున్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఎంపిక, రాష్ట్రంలో కార్పొరేషన్ పదవుల భర్తీ తదితర అంశాలపై హైకమాండ్‌తో రేవంత్ చర్చించనున్నట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నుంచి ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ దరఖాస్తులు స్వీకరించింది. బీఆర్ఎస్ నుంచి కొత్తగా పార్టీలోకి వస్తున్నవారితో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లివ్వ కపోయినా సర్దుకుపోయిన సొంత పార్టీ నేతల నుంచి ఎంపీ టికెట్ల విషయంలో ఒత్తిడి తీవ్రంగా ఉంది. ఎంపీ టికెట్లివ్వలేని వారికి కార్పొరేషన్ పదవులిచ్చి బుజ్జగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ అంశాలపై అధిష్టానంతో చర్చించడానికి సీఎం ఢిల్లీకి వెళుతున్నట్లు తెలుస్తోంది.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ మళ్లీ డుమ్మా

ఆమ్‌ఆద్మీపార్టీ(ఆప్) అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వరుసగా ఆరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)విచారణకు గైర్హాజరయ్యారు. లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ ఆరోసారి పంపిన సమన్లకు కేజ్రీవాల్ స్పందించలేదు. లిక్కర్ స్కామ్ కేసులో సోమవారం తమ ముందు విచారణకు హాజరవ్వాల్సిందిగా ఈ నెల 14న ఈడీ కేజ్రీవాల్‌కు సమన్లు పంపింది. కేజ్రీవాల్ విచారణకు హాజరు కాకపోవడంపై ఆప్ స్పందించింది. ఈడీ పంపిన సమన్లు చట్టవిరుద్ధం అని పేర్కొంది. కేజ్రీవాల్ విచారణకు రాకపోవడంపై ఈడీ ఇప్పటికే కోర్టును ఆశ్రయించింది. మళ్లీ మళ్లీ సమన్లు పంపకుండా కోర్టు నిర్ణయం వచ్చేవరకు వేచి చూడాలి' అని ఈడీకి ఆప్ నేతలు సూచించారు.

50 కోట్ల క్లబ్ లోకి మాస్ మహారాజ ఈగిల్

టాలీవుడ్ స్టార్ హీరో, మాస్ మహారాజ రవితేజ వరుస చిత్రాలు చేస్తూ ఆడియెన్స్ ను, ఫ్యాన్స్ ను అలరి స్తున్నారు. లేటెస్ట్ గా ఈగిల్ మూవీ తో ఆడియెన్స్ ముందుకు వచ్చారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వం లో తెరకెక్కిన ఈ యాక్షన్ ఎంటర్టైనర్ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లతో దూసుకు పోతుంది. ఈ చిత్రం రెండో వారాంతం ముగిసే సమయానికి 50 కోట్ల రూపాయల క్లబ్ లో చేరింది. ఇప్పటి వరకూ వరల్డ్ వైడ్ గా 51.4 కోట్ల రూపాయల వసూళ్లను రాబట్టినట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. సినిమాకి తొలి షో నుండి పాజిటివ్ టాక్ రావడం తో మంచి వసూళ్లు వస్తున్నాయి. కావ్య థాపర్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రం లో అనుపమ పరమేశ్వరన్, నవదీప్, శ్రీనివాస్ అవసరాల, వినయ్ రాయ్, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై నిర్మించిన ఈ చిత్రానికి దావ్ జంద్ సంగీతం అందించారు.

భారత్‌కు మరో జపాన్ కంపెనీ

MITSUBISHI

జపాన్ వ్యాపార దిగ్గజం 'మిత్సుబిషి' భారత దేశంలో కార్ల తయారీ రంగంలో అడుగుపెట్ట డానికి సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగానే కంపెనీ కార్ డీలర్‌షిప్‌లను నిర్వహిస్తున్న టీవీఎస్ మొబిలిటీలో 30 శాతం కంటే ఎక్కువ వాటాను కొనుగోలు చేసినట్లు సమాచారం. మిత్సుబిషి కంపెనీ భారతదేశంలో తన వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించడానికి 33 మిలియన్ డాలర్ల నుంచి 66 మిలియన్ డాలర్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు సమాచారం. టీవీఎస్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని 30శాతం వాటాను కొనుగోలు చేయడంతో.. ప్రస్తుత నెట్‌వర్క్‌లో దాదాపు 150 అవుట్‌లెట్‌లను ఉపయోగించుకుని, ప్రతి కార్ బ్రాండ్‌కు ప్రత్యేక స్టోర్‌లను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అనుకున్నవన్నీ పూర్తయిన తరువాత మిత్సుబిషి భారతదేశంలో అతిపెద్ద స్వతంత్ర కార్ డీలర్‌షిప్‌లలో ఒకటిగా మారే అవకాశం ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా కంపెనీ దేశీయ మార్కెట్ కోసం ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. వాహన విక్రయాలతో పాటు, స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా నిర్వహణ అపాయింట్‌మెంట్‌లు, ఇన్సూరెన్స్ వంటివి సుల భతరం చేయడం వంటి వినూత్న సేవలను ప్రవేశపె ట్టాలని మిత్సుబిషి యోచిస్తోంది. భారత ఆటోమోటివ్ మార్కెట్‌లో పోటీ తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో అమ్మకాలను పెంపొందించుకోవడమే లక్ష్యంగా సంస్థ యోచిస్తోంది.

బీజేపీలోకి మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్?

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశంలో రాజకీయాలు వేడెక్కాయి. పలువురు నేతలు పార్టీలు మారుతున్నారు. ఈ నేప థ్యంలోనే మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కాంగ్రెస్ పార్టీని వీడనున్నట్లు తెలుస్తోంది. ఆయన తన కుమారుడు నకుల్‌నాథ్‌తో కలిసి బీజేపీలో చేరే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారం నేపథ్యంలో ఇప్పుడు మరో వార్త జాతీయ మీడియాలో వైరల్ అవుతోంది.కమల్ నాథ్ తన కుటుంబంతో కలిసి అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరాన్ని సందర్శించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్ల డించినట్లుగా జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. సోమవారం లేదా మంగ ళవారం నాడు కమల్ నాథ్ కుటుంబంతో కలిసి అయోధ్యలో కొలువైన బాలరాముడిని దర్శిం చుకునే అవకాశం ఉందని సదరు వర్గాలు వెల్ల డించినట్లు సమాచారం. కాగా, గత కొన్ని రోజులుగా హస్తం పార్టీపై కమల్‌నాథ్ తీవ్ర అసం తృప్తిగా ఉన్నారు. కమల్‌నాథ్ చింధ్వారా స్థానం నుంచి తొమ్మిది సార్లు ఎంపీగా చేశారు. ప్రస్తుతం అదే చింధ్వారా ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర ఓటమితో కాంగ్రెస్ అధిష్టానం ఆయన్ను పీసీసీ అధ్యక్ష పదవి నుంచి తప్పించింది. పీసీసీ అధ్యక్షుడిగా తొలగించిన విధానంపై కమల్‌నాథ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కుమారుడితో కలిసి ఆయన హస్తం పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. త్వరలోనే బీజేపీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. బీజేపీలో చేరేందుకు మాజీ సీఎం కమల్‌నాథ్ తన కుమారుడు, ఎంపీ నకుల్‌నాథ్‌తో కలిసి ఢిల్లీ చేరుకొన్నారని ఓవైపు ప్రచారం జరుగుతుండగా.. ఇందుకు బలం చేకూర్చేలా కీలక పరిణామం చోటుచేసుకొన్నది. కమల్‌నాథ్‌కు విధేయులుగా భావించే మధ్యప్రదేశ్‌కు చెందిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదివారం ఢిల్లీ చేరుకొన్నారు. చింధ్వారా లీజియన్‌కు చెందిన వీరంతా కమల్‌నాథ్‌తో కలిసి కమలం పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారనే వార్తలు చక్కర్లు కొడు తున్నాయి. ఈ క్యాంపులో మాజీ మంత్రి లఖన్ గంగోరియా కూడా ఉన్నట్టు తెలుస్తున్నది. వీరంతా కాంగ్రెస్ అగ్రనేతల ఫోన్లకు స్పందించడం లేదని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా పార్టీ ఎమ్మె ల్యేలను తమ వెంట తీసుకెళ్లేందుకు కమల్‌నాథ్ వర్గం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది.

మళ్ళీ రెండో స్థానానికి భారత్

ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో భారత్ ఘన విజయం సాధించి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూ టీసీ) పట్టికలో తిరిగి రెండో స్థానానికి ఎగబాకింది. గతవారం దక్షిణాఫ్రికాపై వరుసగా 2 టెస్టులు నెగ్గిన న్యూజిలాండ్ 75 శాతంతో టాప్ లోకి చేరుకుంది. అప్పటిదాకా టాప్‌లో ఉన్న ఆస్ట్రేలియా 2వ స్థానానికి, రెండులో ఉన్న భారత్ 3వ స్థానానికి పడిపోయింది. తాజా ప్రద ర్శనతో రోహిత్ సేన (59.52 శాతంతో) ఆసీస్‌ను వెనక్కినెట్టింది.

రామ్ చరణ్ నెక్స్ట్ కి జాన్వీ ఫిక్స్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తదుపరి గేమ్ చేంజర్ లో కనిపించనున్నారు. ఈ చిత్రం తర్వాత ఉప్పెన ఫేమ్ డైరెక్టర్ బుచ్చిబాబు సన తో ఒక పవర్ ఫుల్ సబ్జెక్ట్ చేస్తున్నారు చరణ్. ఈ కాంబినేషన్ పై ప్రేక్షకుల్లో, అభి మానుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ప్రాజెక్ట్ ను అనౌన్స్ చేసిన తొలి రోజు నుండే అందరిలో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం పై బాలీవుడ్ లో కూడా మంచి బజ్ నెలకొంది. ఈ చిత్రం లో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించనుంది అంటూ ఇప్పటికే పలు వార్తలు వచ్చాయి. తాజాగా వీటిపై ఒక క్లారిటీ వచ్చింది. ప్రముఖ ప్రొడ్యూసర్, జాన్వీ కపూర్ తండ్రి బోని కపూర్ క్లారిటీ ఇచ్చారు. రామ్ చరణ్ నెక్స్ట్ మూవీ కోసం త్వరలో జాయిన్ అవ్వనున్నట్లు ఇటీవల మీడియా తో పేర్కొన్నారు.

కల్కీ ధామ్ ఆలయానికి
ప్రధాని మోదీ శంకుస్థాపన



ఉత్తరప్రదేశ్‌లోని సంబల్ జిల్లాలో కల్కీ ధామ్ ఆలయానికి ఇవాళ ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఆచార్య ప్రమోద్ కృష్ణమ్ ఆహ్వానం మేరకు ప్రధాని ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ప్రమోద్ కృష్ణమ్‌ను కాంగ్రెస్ నుంచి ఆరేళ్ల పాటు వెలి వేసిన విషయం తెలిసిందే. శంకుస్థాపన కార్యక్రమంలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా పాల్గొన్నారు.శ్రీ కల్కి ధామ్ నిర్మాన్ ట్రస్టు కల్కి ధామ్ ఆలయాన్ని నిర్మిస్తున్నది. ఈ ట్రస్టు చైర్మెన్ ప్రమోద్ కృష్ణమ్. శంకుస్థాపన కార్యక్రమం తర్వాత ప్రధాని మోదీ ప్రసంగించారు. సాధువుల భక్తి, ప్రజల స్ఫూర్తి వల్లే కల్కి ఆలయ నిర్మాణానికి నాంది పడిందన్నారు. పెద్ద పెద్ద సాధువులు, ఆచార్యుల సమక్షంలో తాను శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. భారతీయ విశ్వాసాలకు కల్కి ధామ్ కేంద్ర బిందువుగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తమ హయాంలోనే కాశీలోని విశ్వనాథ్ ధామ్ అభివృద్ధి జరిగిందన్నారు. ఉజ్జయినిలో మహాకాల్ ఆలయ అభివృద్ధి కూడా జరిగిందన్నారు. ఈ కాలంలోనే సోమనాథ్, కేదార్‌నాథ్ డెవలప్మెంట్ జరిగిందన్నారు. అభివృద్ధితో పాటు వారసత్వ మంత్రాన్ని అవలంబిస్తున్నామన్నారు. ఒకవైపు దైవక్షేత్రాలను అభివృద్ధి చేస్తున్నామని, మరో వైపు నగరాల్లో హైటెక్ మౌళికసదుపాయాల్ని కల్పిస్తున్నట్లు ప్రధాని వెల్లడించారు. ఆలయాలను పునర్ నిర్మించడంతో పాటు దేశవ్యాప్తంగా వైద్యశాలలను కూడా కట్టిస్తున్నామన్నారు. విదేశాల్లో మన పూర్వీకుల శిల్పాలను తెప్పిస్తున్నామని, అలాగే విదేశీ పెట్టుబడులు కూడా రికార్డు స్థాయిలో వస్తున్నాయన్నారు.

అసిస్టెంట్ డైరెక్టర్‌తో శంకర్ కూతురి రెండో పెండ్లి..

ప్రముఖ డైరెక్టర్ శంకర్ కూతురు మళ్లి పెండ్లిపీటలు ఎక్కబోతున్నది. మొదటి భర్తతో విడిపోయిన శంకర్ పెద్ద కూతురు ఐశ్వర్య.. అసిస్టెంట్ డైరెక్టర్ తరుణ్ కార్తికేయన్‌తో రెండో వివాహానికి సిద్ధమయ్యింది. తాజాగా వీరిద్దరికి నిశ్చితార్థం కూడా జరిగింది. ఈ విషయాన్ని శంకర్ రెండో కూతురు అదితి శంకర్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. అలాగే ఎంగేజ్‌మెంట్‌కు సంబంధించిన ఫొటోలను కూడా షేర్ చేసింది.శంకర్ పెద్ద కూతురు ఐశ్వర్య 2021లో క్రికెటర్ రోహిత్ దామోదరన్‌ను పెండ్లి చేసుకుంది. కానీ కొద్ది నెలలకే వారి మధ్య విబేధాలు వచ్చాయి. పైగా రోహిత్ దామోదరన్ నిర్వహిస్తున్న క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో మహిళా ఆటగాళ్లతో అసభ్యంగా ప్రవర్తించారనే ఫిర్యాదులు రావడంతో ఆయనపై పోక్సో చట్టం కింద కేసు కూడా నమోదయ్యింది. దీంతో రోహిత్ నుంచి విడాకులు తీసుకుంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

వివాహ వేడుకలో కాల్పులు.. పాక్ గ్యాంగ్‌స్టర్
అమీర్ బలజ్ తిపూ మృతి

పాకిస్థాన్‌లో మరో గ్యాంగ్‌స్టర్ హత్యకు గురయ్యాడు. లాహోర్ అండర్‌వరల్డ్ డాన్, గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ చీఫ్ అమీర్ బలజ్ తిపును ఓ దుండగుడు కాల్చివేశాడు. ఆదివారం లాహోర్‌లోని చంగ్ ప్రాంతంలో ఓ వివాహ వేడుకకు హాజరైన అమీర్‌తోపాటు మరో ఇద్దరిపై సాయుధుడైన ఓ వ్యక్తి కాల్పులు జరిపాడు. దీంతో ముగ్గురు తీవ్రంగా గాయ పడ్డారు. హుటాహుటిన వారికి జిన్నా దవాఖానకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ అమీర్ మరణించాడు. కాగా, అమీర్ సహాయకులు జరిపిన కాల్పుల్లో దుండగుడు అక్కడికక్కడే మరణించాడని పోలీసులు తెలిపారు. అసలు ఆయనపై దాడికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని వెల్లడించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అయితే అమీర్ కుటుంబానిది హింసాత్మక చరిత్ర ఉన్నది. 2010లో అల్లమా ఇక్బాల్ ఎయిర్‌పోర్టుపై జరిగిన దాడిలో ఆయన తండ్రి ఆరిఫ్ అమీర్ చనిపోయారు.

కారు బోల్తా.. తెలంగాణ ప్రభుత్వ విప్
అడ్లూరి లక్ష్మణ్‌కు గాయాలు

తెలంగాణ ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రమాదానికి గురయ్యారు. ఎండపల్లి మండలం అంబారిపేట వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది.ఈ ఘటనలో లక్ష్మణ్ కుమార్‌తో పాటు కారులో ఉన్న ఇతరులకు స్వల్ప గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని కరీంనగర్‌కు తరలించి చికిత్స అందిచగా.. అడ్లూరిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలి స్తున్నట్లు సమాచారం.

పెళ్లీడు దాటిపోతుందని ఏం చేశాడో తెలుసా?

పెళ్లీడు దాటిపోతుంది.. పెళ్లికుమార్తె కావలెను' అంటూ ఓ యువకుడు రిక్షాకు హోర్డింగ్ కట్టుకుని తిరుగుతున్నాడు. మధ్యప్రదేశ్‌లోని దమోహ్‌కి చెందిన దీపేంద్ర రాథోడ్(29) ఈ-రీక్షా నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అతడి ఫొటో, విద్యార్హతలు వంటి వివరాలున్న హోర్డింగ్‌తో నగరమంతా చక్కర్లు కొడుతున్నాడు. 'నా తల్లీదండ్రులు పూజల్లో మునిగిపోయారు. సమాజంలో అమ్మాయిలు తగ్గిపోయారు. నా భాగ స్వామిని సంతోషంగా చూసుకుంటా' అని అతడు అంటున్నాడు.

ఎక్కడైనా గెలవగలం..
మా బలం అదే

ఎలాంటి పిచ్‌ల మీదైనా గెలవగల సత్తా టీమిండియాకు ఉందని కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. సౌతాఫ్రికాలో టెస్టు మ్యాచ్ గెలవడమే ఇందుకు నిదర్శమని పేర్కొన్నాడు. ఇలాంటి పిచ్‌లే కావాలని పట్టుబట్టే రకం తాము కాదని.. అయినా పిచ్ రూపకల్పన పూర్తిగా క్యూరేటర్ నిర్ణయమని పేర్కొన్నాడు. ఇంగ్లండ్‌తో తాజా సిరీస్‌లో ఇప్పటి వరకు ఆడిన మూడు టెస్టుల్లో భిన్న సవాళ్లకు ఎదురొడ్డి విజయాలు నమోదు చేస్తున్నామని జట్టును ప్రశంసించాడు. కాగా ఉపఖండ పిచ్‌లు సాధారణంగా స్పిన్‌కు అనుకూలిస్తాయన్న విషయం తెలిసిందే. అదే విధంగా విదేశాల్లో ముఖ్యంగా సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పిచ్‌లు ఫాస్ట్ బౌలర్లకు స్వర్గ ధామంగా ఉంటాయి. అయితే, ఇంగ్లండ్ భారత గడ్డపై టెస్టులు ఆడుతున్నపుడల్లా.. ముఖ్యంగా గత సిరీస్ సమయంలో మ్యాచ్‌లు రెండు రోజుల్లోనే ముగిసిపోవడంతో మైకేల్ వాన్ వంటి మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పించారు. టీమిండియాకు అనుకూల పిచ్‌లు రూపొందించారంటూ .. బంతి ఇంతలా టర్న్ అవడం ఏమిటని ప్రశ్నించారు. సొంతగడ్డపై ఆడుతున్నపుడు హోం టీమ్‌కు కాస్త అడ్వాంటేజ్ ఉంటుందనే విషయాన్ని మరిచి టీమిండియా ప్రతిభను తక్కువ చేసేలా మాట్లాడారు. ఈ క్రమంలో ఇటీవల భారత మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ బాస్ సౌరవ్ గంగూలీ సైతం ప్రశ్నించాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ వంటి వరల్డ్‌క్లాస్ పేసర్లు జట్టులో ఉన్నారని.. వాళ్లు కూడా స్పిన్నర్ల మాదిరే పది వికెట్లు తీస్తే చూడాలని ఉందని దాదా పేర్కొన్నాడు. ఈ విషయంపై ఇప్పటికే .. మూడో టెస్టు ముగిసిన తర్వాత రోహిత్ కెప్టెన్ రోహిత్ శర్మ సైతం రెస్పాండ్ అయ్యాడు. ఈ మేరకు.. "ఇలాంటి పిచ్‌లపై మేము గతంలో చాలా మ్యాచ్‌లు గెలిచాం. నిజానికి బంతి టర్న్ అయితే.. దానిని మాకు అనుకూలంగా మార్చుకోవడం మాకున్న బలం. జట్టు సమతూకంగా ఉండటానికి ఇది దోహదం చేస్తుంది. అయితే, పిచ్ ఎలా ఉండాలన్న అంశాన్ని మేము డిసైడ్ చేయం కదా! మ్యాచ్‌కు రెండు రోజుల ముందు వేదిక దగ్గరకు వస్తాం. ఆ రెండు రోజుల్లో మేము ఎలాంటి మార్పులు చేయగలం. క్యూరేటర్ల నిర్ణయాను సారమే పిచ్ రూపకల్పన జరుగుతుంది. అయితే, వికెట్ ఎలా ఉన్నా ఆడి గెలవడమే మా బలం. సాధించామో చూశారు కదా! ఈ సిరీస్‌లో గత మూడు టెస్టుల్లో భిన్న సవాళ్లు ఎదుర్కొన్నాం. హైదరాబాద్‌లో బాల్ స్పిన్ అయింది. వికెట్ కాస్త స్లోగా ఉంది. వైజాగ్‌లో మ్యాచ్ సాగుతున్న కొద్దీ మరింత స్లోగా మారింది. ఇక్కడ తొలి మూడు రోజులు కూడా బాగానే ఉంది. నాలుగో రోజు మాత్రం కాస్త ఎక్కువగా టర్న్ అయింది. ఇండియాలో పిచ్‌లు ఇలాగే ఉంటాయి" అని రోహిత్ శర్మ పేర్కొన్నాడు. పిచ్ స్వభావాన్ని అర్థం చేసుకున్నాడు కాబట్టే తొలి ఇన్నింగ్స్‌లో 112 పరుగులు చేసిన రవీంద్ర జడేజా అద్భుత స్పెల్(5/41) కూడా వేశాడని రోహిత్ ఈ సందర్భంగా ప్రశంసించాడు. కాగా రాజ్‌కోట్ టెస్టులో ఇంగ్లండ్‌పై 434 పరుగుల తేడాతో రికార్డు విజయం సాధించిన టీమిండియా.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రస్తుతం 2-1తో ముందంజలో ఉంది. ఇరు జట్ల మధ్య ఫిబ్రవరి 23 నుంచి నాలుగో టెస్టు జరుగనుంది.



నాలుగో టెస్టుకు
బుమ్రా దూరం?

పలు నివేదికల ప్రకారం ఈ నెల 23 నుంచి ఇంగ్లండ్‌తో ప్రారంభంకానున్న నాలుగో టెస్టుకు టీమిండియా పేస్ గన్ జస్ప్రీత్ బుమ్రా దూరంకానున్నాడు. రాంచీ వేదికగా జర గనున్న నాలుగో టెస్ట్ నుంచి బుమ్రాకు విశ్రాంతి కల్పించను న్నారని సమాచారం. నాలుగో టెస్టు ఫలితాన్ని బట్టి ఐదో టెస్టుకు కూడా దూరం కావొచ్చని తెలుస్తోంది. గతేడాది ఆగస్టులో గాయపడిన బుమ్రా కోలుకోవడానికి ఏకంగా 11 నెలలు పట్టింది. దీంతో అప్పటి నుంచి బుమ్రాను బీసీసీఐ జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తోంది. అతని మీద ఎక్కువ పని భారం పడకుండా చూస్తోంది. వన్డే ప్రపం చకప్ ముగిసిన అనంతరం ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్, సౌతాఫ్రికాతో వన్డే, టీ20 సిరీస్ నుంచి బుమ్రాకు సెలెక్టర్లు విశ్రాంతి కల్పించారు. ఈ క్రమంలోనే ఇంగ్లండ్‌తో వరుసగా 3 టెస్టులు ఆడిన బుమ్రా మీద వర్క్ లోడ్ తగ్గించే క్రమంలో నాలుగో టెస్ట్ నుంచి విశ్రాంతి కల్పించనున్నారని సమాచారం. టెస్ట్ సిరీస్ అనంతరం ఐపీఎల్, టీ20 ప్రపం చకప్ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నారని తెలుస్తోంది.దీంతో రాజ్‌కోట్ టెస్ట్ ముగిసిన తర్వాత బుమ్రా నాలుగో టెస్టు వేదికైనా రాంచీ వెళ్లకుండా తన స్వస్థలం అయినా అహ్మదాబాద్ వెళ్లనున్నాడని సమాచారం. ఇప్పటి వరకు ముగిసిన 3 టెస్టుల్లో 80 ఓవర్లు బౌలింగ్ చేసిన బుమ్రా 17 వికెట్లు తీశాడు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. ఒకవేళ బుమ్రా నిజంగానే నాలుగో టెస్టుకు దూరమైతే అతని స్థానంలో ముఖేష్ కుమార్ లేదా నాలుగో స్పిన్నర్ జట్టులోకి వచ్చే అవ కాశాలున్నాయి. కాగా మరో పేసర్ మహ్మద్ సిరాజ్‌కు కూడా రెండో టెస్ట్ నుంచి విశ్రాంతి కల్పించిన సంగతి తెలిసిందే. ఇక 5 టెస్ట్‌ల సిరీస్‌లో భారత జట్టు ప్రస్తుతం 2-1తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే.

కుర్రాళ్ల హార్ట్ బ్రేక్ చేసిన అనుపమ పరమేశ్వరన్

గ్లామర్ షోకు దూరంగా ఉంటూ యూత్ ఫేవరేట్ క్రష్ లిస్ట్ లో ఫస్ట్ ప్లేస్ లో ఉన్న ఈ బ్యూటీ.. రౌడీ బాయ్స్ సినిమాలో లిప్ లాక్ సీన్స్ లో నటించి షాకిచ్చింది. ఈ సినిమాలో అనుపమ యాక్టింగ్ చూసి కుర్రాళ్ల మనసులు చెదిరిపోయాయి. ఇక ఇప్పుడు మరోసారి కేరళ కుట్టి విషయంలో ఎంతోమంది అబ్బాయిలు బాధపడిపోతున్నారు. మొన్నటివరకు ఎప్పుడూ ట్రెడిషనల్ లుక్.. ఎంతో సింపుల్ గా కనిపిస్తూ నెట్టింట ఫోటోస్ షేర్ చేస్తూ హల్చల్ చేసిన అనుపమ.. ఇప్పుడు అందాలు ఆరబోస్తూ సోషల్ మీడియాను షేక్ చేస్తుంది.ఉం గరాల జుట్టు... పెద్ద కళ్లు.. చందమామలాంటి మోముతో సౌత్ కుర్రాళ్ల హృదయాలను దోచేసింది మలయాళీ కుట్టి. తొలి సినిమాతోనే లంగావోణిలో ట్రెడిషనల్ లుక్ లో అందంగా కనిపించి.. అద్భు తమైన నటనతో ఒక్కసారిగా తన ఫాలోయింగ్ పెంచేసుకుంది.. తనే అనుపమ పరమేశ్వరన్. ఈ కేరళ కుట్టికి తెలుగులో ఉన్న క్రేజ్ గురించి చెప్ప క్కర్లేదు. 'అఆ' సినిమాతో తెలుగు తెరకు పరి చయమై తొలి చిత్రానికి సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత శతమానం భవతి.. ఉన్నది ఒకటే జిందగీ, కృష్ణార్జున యుద్ధం, హలో గురు ప్రేమ కోసమే సినిమాల్లో కనిపించి మెప్పించింది. గ్లామర్ షోకు దూరంగా ఉంటూ యూత్ ఫేవరేట్ క్రష్ లిస్ట్ లో ఫస్ట్ ప్లేస్ లో ఉన్న ఈ బ్యూటీ.. రౌడీ బాయ్స్ సినిమాలో లిప్ లాక్ సీన్స్ లో నటించి షాకిచ్చింది. ఈ సినిమాలో అనుపమ యాక్టింగ్ చూసి కుర్రాళ్ల మనసులు చెదిరిపోయాయి. ఇక ఇప్పుడు మరోసారి కేరళ కుట్టి విషయంలో ఎంతోమంది అబ్బాయిలు బాధపడిపోతున్నారు. మొన్నటివరకు ఎప్పుడూ ట్రెడిషనల్ లుక్.. ఎంతో సింపుల్ గా కనిపిస్తూ నెట్టింట ఫోటోస్ షేర్ చేస్తూ హల్చల్ చేసిన అనుపమ.. ఇప్పుడు అందాలు ఆరబోస్తూ సోషల్ మీడియాను షేక్ చేస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ షేర్ చేసిన ఓ వీడియో చూసి కుర్రాళ్ల హార్ట్ బ్రేక్ అయ్యింది.



సీఎం జగన్ కు చంద్రబాబు
ఓపెన్ ఛాలెంజ్

సీఎం జగన్ కు చంద్రబాబు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. బూటకపు ప్రసంగాలు కాదు.. అభివృద్ధి పాలన ఎవరిదో.. విధ్వంసం పాలన ఎవరిదో.. జనం ముందు చర్చిద్దామని చంద్రబాబు సీఎం జగన్ కు సవాల్ చేశారు. 'దమ్ముంటే నాతో బహిరంగ చర్చకు రా.. ప్లేస్, టైం నువ్వే చెప్పు.. ఎక్కడికైనా వస్తా.. దేనిమీదైనా చర్చిస్తా.. నువ్వు సిద్ధమా? జగన్ రెడ్డి' అని ట్వీట్ చేశారు.

వైసీపీ మేనిఫెస్టోపై
ఉత్కంఠ

రానున్న ఎన్నికల నేపథ్యంలో ఏపీ పొలిటికల్ హీట్ మొదలైంది. ఈ నేపథ్యంలో త్వరలో వైసీపీ మేనిఫెస్టోను సీఎం జగన్ విడుదల చేయ నున్నట్లు ప్రచారం జరుగుతోంది. రైతులకు రూ. లక్ష వరకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం లాంటి అస్త్రాలు ప్రయోగించొచ్చని విశ్లేషకులు అంటున్నారు. అలాగే, ఇవి కాకుండా కొత్త స్కీమ్‌లు ఏమైనా ప్రకటిస్తారా? అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. కాగా, ఇప్పటికే టీడీపీ-జనసేన పార్టీలు ఫ్రీ బస్ హామీని చ్చాయి.